# జెర పయిలం కొడుకో!

చాలా దూరం నుంచి ప్రయాణం చేసి రామయ్య కుటుంబం సికిందరాబాదులో దిగింది. రామయ్యకు ఎటుపోవాలో దిక్కుతోచకుండా వుంది. డీజిల్, పెట్రోలు వాసనకు ముక్కు మూసుకున్న రాములమ్మ తన భర్త ఎటు తీసుకెళితే అటు వెళదామని నిశ్చయించుకుని ఏమీ మాట్లాడకుండా భర్తకు దగ్గరలో నిల్చున్నది. పిల్లలు సరేసరి.

అప్పటికే రోడ్డు మీద లైట్ల వెలుతురు పట్టపగలులా వుంది. అన్ని లైట్లను, రాతిరిపూట అంత వెలుతురును ఎన్నడూ చూడని వెంకటేశానికి ఆకాశంలో వున్నట్టనిపించి అటుపక్కన ఏముందో, ఇటుపక్కన ఏముందో తెలుసుకుందామని కుతూహలంతో బెరుకు బెరుకుగానే నాలుగడుగులు ముందుకేశాడు.

కొడుకు కదలికల్ని చూసి -

"ఎక్కడికి పోకు బిడ్డా! ఆగమయితవ్... ఇది మన ఊరుగాదు, మన పల్లెగాదు మనకు తెలిసిన జాగకాదు, మనలెక్కగాదు. జెర పయిలంగ ఉండాలె...తోవలన్ని ఒక తీరుగనే వుంటయ్. మల్ల పోదామంటే మన తోవకు రాము. 'శెడుగు' లెక్క అటూ ఇటూ ఉరుకులాడకు. జెర కాలు ఒక దగ్గర నిలువనీ..." అన్నాడు రామయ్య.

నగరం గురించి తాను అర్థం చేసుకున్న విషయాన్ని కొడుక్కు చెప్పడానికి రామయ్య ప్రయత్నం చేశాడు. కాని తన మనసుకే తెలుస్తోంది, చెప్పదల్చుకున్నదేదో సంపూర్ణంగా చెప్పలేకపోయానని. అయితే మిగతా విషయాలు కూడా ఆ మూడు ముక్కల్లో ఇమిడి వున్నాయన్న ధీమా మాత్రం ఆయన చూపుల్లో వుంది.

ఆ మాటలతో, చూపులతో వెంకటేశాన్ని పగ్గమేసి ఆపినట్టయింది. అటు పరుగెత్తుకపోయి, ఇటు పరుగెత్తుక రావొచ్చు అనుకున్న వెంకటేశానికి తండ్రి మాటల్లో నగర స్వభావమేమిటో తెలిసింది. దాంతో తన మనసు పరుగెత్తకుండా కట్టేశాడు. కాని లోపల కోరికగానే వుంది.

రాములమ్మ ముక్కు దగ్గరినుంచి కొంగు తీయడం లేదు. ఏ మాత్రం వాసన రావడం తగ్గిందనిపించినా అప్పుడు తుపుక్కున పక్కన ఊసి తిరిగి ముక్కు మూసుకుంటోంది. ఆండాలు తన లంగాతో అప్పుడప్పుడు చీమిడిముక్కు తుడుచుకుంటూ, చెవుల్లో వేళ్లు పెట్టుకుని, మరీ పెద్ద చప్పుడు వచ్చినప్పుడు తల్లికి దగ్గరగా జరిగి నిల్చుంటోంది.

రామయ్య మాత్రం వెంట తెచ్చుకున్న బాసండ్లు, బట్టలమూటల పక్కన కూర్చొని-

"ఈ రాతిరిపూట ఎక్కడికి పోదు? తెలిసినోళ్ళు ఎవలు లేకపోయిరి? వెంట ఆడమనిషి వుండె, పిల్లలుండిరి. ఈ రాతిరికి ఏడ తలదాసుకోవాలే? ఏడ గడియ సేపు నిద్రపోవాలే? (హిస్సాం) గంజ్‌ల కుర్మ బీరప్ప వున్నడనే బరోసతోటి వస్తి! ఆయన యిల్లు ఎక్కడనో? ముంగిలి ఎక్కడనో? ఈ రాతిరిపూట ఎక్కడని లెంకులాడుదు? నాకేమో యీ పట్నం మూతి తెలువకపాయే, తోక తెలువకపాయే... పుండయిన కాలుకు దెబ్బ తాకినట్టు యిప్పటికే కష్టంల వున్నంరా అంటే యిదొకటి కొత్తది వచ్చిపడె..." అని ఆలోచిస్తూ అరిచేత్తో నుదురు కొట్టుకున్నాడు.

జీవితంలో వేసిన ప్రతి అడుగు దగ్గర పరాజయం పొందిన భావన ఆయన ఆలోచనల్లో వుంది.

తనను కొత్త ప్రపంచంలోకి తీసుకొచ్చి పడేసినట్టు అనిపిస్తోంది రాములమ్మకు. మాట్లాడలేకుండా నోటినిండా ఉమ్మి వుంది. పిల్లల ఆలోచనల్లో పిల్లలున్నారు.

అంతలోకే-

సంకకు జోలె, చిరిగిపోయిన మాసిన బట్టలు, చేతిలో కట్టె, ఇంకో చేతిలో ఓ డబ్బా, వంకర్లు తిరిగిన పాత బూట్లు వేసుకుని, తలకు ఓ పాత ప్లాస్టిక్ టోపీ పెట్టుకుని తన ముసలితనాన్ని, తన అసహాయతను పది మందికి వణుకుతున్న కంఠంతో చెపుతూ, బిచ్చమడుగుతూ, ఎవరైనా చిల్లర పైసలిస్తే డబ్బాలో వేసుకుంటూ అరవై ఏళ్ళు దాటిన ముసలాయన రామయ్య కూర్చున్న వైపు వొచ్చాడు.

అలవాటు ప్రకారంగా "అయ్యా! శాతగాని ముసలోణ్ణి, కొడుకులు బిడ్డలు ఎవరు లేరు..." అని మధ్యలోనే ఆపేసి ముందుకు సాచిన చేతిని వెనక్కి తీసుకున్నాడు.

విచారంగా కూర్చున్న రామయ్యను, అతని పక్కన బిక్కు బిక్కుమంటూ నిల్చున్న రాములమ్మను, ఇద్దరు పిల్లల్ని చూసేసరికి వాళ్ళు ఏదో ఆపదలో వున్నట్టనిపించింది ముసలాయనకు. పిల్లల అవతారం చూస్తుంటే జాలి గూడా కలిగింది. ఓ క్షణం ఆలోచించి వెనక్కి వేయబోయిన అడుగు ముందుకే వేస్తూ-

"పట్నంకు కొత్తగొచ్చినవా బిడ్డా?..." అని వణుకుతున్న కంఠంతో అడిగాడు ముసలాయన. అలా అడిగేప్పుడు కొంత ముందుకు వంగాడు. ఆయన నోట్లోంచి చుట్ట వాసన గుప్పుమంది. దాంతో పాటు జోలెలోంచి పాచిన పప్పు వాసన కూడా వొచ్చింది.

లైటు వెలుతురులో, వత్తయిన కనుబొమల కింద చిన్నగా తళుక్కుమంటున్న ముసలాయన కళ్ళలోకి చూస్తూ రామయ్య-

"అఁ... బస్సు దిగి జెర సేపయింది పెద్దమనిషి.." అన్నాడు.

"ఎక్కడికి పోవాలే మరి?" మూట ముల్లెను చూస్తూ అడిగాడు ముసలాయన, ఒక్కో పదాన్ని నొక్కి పలుకుతూ.

ఓ క్షణం రామయ్య మనసులో అనుమానం వొచ్చింది. కాని ఆ మరుక్షణమే మటుమాయమైంది. దాంతో లేచి నిలబడుతూ-

"ఎక్కడ లేదు. పట్నంకే వచ్చిన. గంజ్‌ల తెలిశినోళ్ళు వున్నర్. గాని ఆ గంజ్ ఎక్కడ్నో తెలువది. ఈ రాత్రి పూట ఎక్కడాని పోవాలె. పోయినా మా ఊరాయన యిప్పుడు ఆడ వుంటడని నమ్మకం లేక ఏం జేయాల్నా అని ఆలోచనల పడ్డ..." అన్నాడు తల గోక్కుంటూ.

"ఏ వూరు మనది?"

"జనగామ దగ్గర బచ్చన్నపేట."

"ఏం కులస్థులు?"

చెప్పడానికి రామయ్య కొంతసేపు తటపటాయించాడు. ఈ ముసలాయన కెందుకు ఇవన్నీ సంగతులు అని రవ్వంత విసుగు కూడా వొచ్చింది. కాని యిప్పుడు తాము చెట్టు మీద పక్షుల తీరుగ ఉన్న విషయం మనసులో మెదిలి 'ఎవరి ముక్కు మొఖం తెలువని పట్నంల పలకరిచ్చినోడే బాంధవుడు...' అనుకుని తన కులమేమిటో చెప్పాడు రామయ్య.

ముసలాయన నుదుటి మీద ముడుతల విడిపడ్డాయి. దౌడలు సాగినాయి. పళ్ళులేని నోరు నవ్వింది. మొఖమంతా వెలుగే... రాములమ్మ వైపుకు చూస్తూ-

"మీ వోళ్ళా?..." అనడిగాడు.

"అఁ..." అన్న తర్వాత "ఈ ఆడామెను, ఆ పిల్లల్ని తీసుకుని ఏడికి పోవాల్నా అని ఆలోచనల పడ్డ! ఎటూ ఆధారం కనవడ్తలేదు..." అన్నాడు రామయ్య.

"ఇంత పెద్ద పట్నంల తలదాసు కుంతందుకు తావే వుండదా? ఫికరెందుకు జేస్తవ్ బిడ్డా, నేన్ జూపిస్త పా...ఆ మూట ముల్లె తీసుకుని, నీపిల్లల్ని, నీ భార్యను యెంట పెట్టుకుని నాయెంటరా. ఈ రాత్రికి నీకు నీడ సూపిస్త! రేపు మీ ఊరాయన దగ్గర్కి పోదువ్ గాని..." అన్నాడు ముసలాయన. ఆ గొంతులో కన్న తండ్రి ప్రేమ కనిపించింది.

రామయ్య నమ్మలేకపోయాడు.

అరగంట తరువాత రామయ్య కుటుంబం సికిందరాబాద్ రైల్వేస్టేషన్ పోర్టికోలో ఓ మూల ఊరి నుంచి తెచ్చుకున్న జొన్న రొట్టెలు తింటూ వుంది. వాళ్ళతో పాటు ముసలాయన వున్నాడు- అతని చేతిలోనూ జొన్నరొట్టె వుంది.

అప్పుడు రాతిరి తొమ్మిది దాటింది. ప్రధానమైన పోర్టికోలోకి వాహనాలు వస్తూ పోతున్నాయి. కాని ముసలాయన, రామయ్య వున్న పోర్టికోలోకి ఎలాంటి వాహనాలు రావడంలేదు. అటూ ఇటూ నడిచేవాళ్ళు, కొంత మంది రైల్వే హమాలీలు మాత్రమే ఆ పోర్టికోలోంచి తిరుగుతూవున్నారు. బయట కార్ల దగ్గర వున్న లైటు వెలుతురు గాకుండా ఓ ట్యూబ్‌లైటు వెలుగుతోంది. మరో మూలకు ఓ పండు ముసలామె తన గోనె సంచులను పరచుకుని పడుకున్నది. లైటు కింద ఇద్దరు పిల్లలు 'బన్ రొట్టె' తింటూ కూర్చున్నారు.

టెలిఫోన్ బూత్ పక్కన తమ సామాన్లు పెట్టుకుని, అక్కడే లైటు వెలుతురు ఎక్కువగా పడని ప్రదేశంలో రాములమ్మ బట్టల మూట విప్పి ఓ దుప్పటి పరచి, పిల్లలను పండేసి, తాను అండాలు పక్కన ఒరిగి, ఓ పాత చీర కాళ్ళ మీద వేసుకుంది. అదే చీరకొసను పిల్లల కాళ్ళపై వేసింది.

పోర్టికో స్తంభం ఆనుకుని కూర్చున్న ముసలాయన దగ్గర రామయ్య కూర్చుని బీడి వెలిగించాడు. ముసలాయన కాళ్ళు పారజాపుకుని చుట్ట వెలిగించి, రెండు దమ్ములు పీల్చినాక, పక్కన ఊంచి-

"ఊరు యిడిచి పెట్టి పట్నం ఎందుకొస్తివో చెప్పకపోతివి రామయ్యా?..." అనడిగాడు.

రామయ్య మనసంతా ఊర్లోనే వుంది. ఆలోచనలన్నీ ఊరి చుట్టూ తిరుగుతూనే వున్నాయి. ఈ క్షణాన ఊర్లోవున్న వాళ్ళు ఎవరేమి చేస్తున్నారో రామయ్య కళ్ళ ముందు కనిపిస్తూనే వుంది. తాను యింకా వాళ్ళతో కలిసి మాట్లాడుతున్నట్టుగానే వుంది. గుడిశె హోటల్ దగ్గర కూర్చుని ముచ్చట పెడుతున్నట్టుగానే వుంది... ఆ ఆలోచనలో పడ్డ రామయ్య చేతిలోని బీడి ఆరిపోయింది. అప్పుడే ముసలాయన గొంతు వినిపించడంతో, దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి, చేతిలోని బీడిని దూరంగా విసిరేసి, అరచేతులతో మోకాళ్ళను రాసుకుంటూ-

"ఏమి జెప్పాలె పెద్దయ్యా... కాలం ఎన్కకు అయిపాయే, వాన కాలం అయిపోవట్టే గింత చినుకు లేకపాయే, యీ కార్తెల ఎన్ని వానలు గొట్టేది వుండే? కుండపోతగా వానలు పడేటి మాట- అసుంటిది ఏది? ఒక్కవాన లేకపాయే... ఎండకాలంల ఎండలు కాసినట్టు ఎండలు కాస్తున్నయ్. మృగశిరల పడ్డ ఆ తుప్పుర్లకు మొలిశిన గడ్డి కూడా ఎండిపోయింది. భూమ్మీద పసక సూద్దామంటె లేకుంట అయింది. యిగ పునాస పంటలయితే పుణ్యానికే పోయినయ్. వానలు పడ్తయ్‌గదాని అందరు చెల్కలు దున్నుకొని మొక్కజొన్న, కందులు, పెసర్లు, పుంట్లు అలికితే ఏమయింది? ఏడి కాడికి ఎండిపోయినయ్. వొరుగుల లెక్క అయి, గల గలా అనవట్టే... యిగ పసువులకు మేతలేక వాటి ఉసురు పోసుకున్నట్టయింది. భూమ్మీద ఏరుక తిందామంటే పసక లేకపాయే, ఎండిన గడ్డి ఏద్దామంటే గడ్డి లేకపాయే. యిగ అవి ఎట్ల బతుకాలే?..." ప్రశ్నిస్తూ ఓ క్షణం ఆగాడు.

ముసలాయన నోట్లో ఉమ్మిని పక్కన ఊంచి-

"కడుపులకు లేంది. అవ్వెట్ల బతుకుతయ్..." అన్నాడు.

తిరిగి రామయ్య కొనసాగిస్తూ-

"...పాలిచ్చే బర్లు, ఆవులు ఎండిపోయినయ్. నాకు ఒక్క బర్రె, ఒక్క ఆవే వుంది గాని ఊర్లె ఎన్ని బర్లు, ఆవులు లేవు? ఆ నోరులేని జీవరాసుల ఉసురు పోసుకొనుడు ఎందుకని ఒక్కొక్కలు కటికోళ్ళకు అమ్మిండ్రు... ఆ దుడ్డెలు, ల్యాగలు వొర్లుతుంటె నా పానం బోయింది. గాని ఏం జేశెటట్టుంది? ఏమీలేదు- యిగ పొట్టకెళ్ళక, కూళ్ళులేక, పనులులేక అందరూ పొట్ట చేతుల పట్టుకోని తలా ఒక్క దిక్కు పోయిండ్రు... ఊరు యిడిశిపోలేని దుడ్డె దుడ్డె పోరగాళ్ళు మా ఊరి పెద్దపటేలు బాయి తవ్వేతందుకు పోతే ఆయింత దరి కూలి ఐదుగురు సచ్చిండ్రు." అని చెప్పాడు. ముసలాయన నోరు తెరిచి ఆశ్చర్యంగా రామయ్య వైపు చూశాడు.

"అన్యాయంగా అళ్ళ పానాలు పోయినయా?' అనడిగాడు ముసలాయన.

"ఆఁ... యిగ తాగెతందుకు నీళ్ళు కూడ కరువయినయ్... యిగ వానలు పడాలని రాత్రి పూట భజనలు జేసిండ్రు, బతుకమ్మ ఆడిండ్రు, శివుని గుళ్ళె లింగం మునిగే వరకు నీళ్ళు నింపి పూజలు జేసిండ్రు, కప్పతల్లిని రోకలిబండకు కట్టి ఊరంతా తిరిగిండ్రు, వానదేవుని పాటలు పాడిండ్రు... ఎన్నిజేసినా, ఏమిజేసినా వానచినుకు లేదు. మా వూరి పక్కకు ఆఖర్కి యజ్ఞం గూడా జేసిండ్రు. అయినా గింత వానసుక్క గూడా లేదు. ఊరంత పాడు వడ్డట్టయింది. చేద్దామంటే పనిలేదు, తిందామంటె తిండి లేదు. అట్లయితేగాదు, ఇట్లయితే గాదని పట్నం బస్సెక్కి వొచ్చి దిగిన. గీ గండం గడిచి బయట పడితే, అంత వరకు సల్లగ బతుకుతే, ఐదారు నెలలయినంక మల్ల ఊరికి పోక పోతానా అని అనుకున్న..."

ఆ మాట పూర్తి చేయకముందే ఆవలింత వొచ్చింది. అట్లాగే కళ్ళు మూసుకపోతూ వున్నాయి.

"మంచి పని జేసినవ్..." అంటూ ముసలాయన అక్కడి నుంచి లేచాడు.

రామయ్య అక్కడే ముదురుకుని పడుకొని రుమాలు కప్పుకున్నాడు.

తెల్లారినాక హిస్సాంగంజ్‌లో కుర్మ బీరప్పను కలుసుకుని, గాంధీ ఆసుపత్రికి అటువైపు పిట్టెలోళ్ళు వుండే గుడిసెల్లో రేకులు కప్పిన ఓ గుడిసె కిరాయికి తీసుకున్నాడు రామయ్య. మరో నాలుగు రోజుల తర్వాత గంజ్‌లో కూరగాయల కమీషన్ ఏజెంట్ దుకాణంలో హమాలీగా చేరాడు. ఆయన భార్య రాములమ్మ ఆదయ్యనగర్‌లో, బోయిగూడలో పనిమనిషిగా నాలుగయిదు ఇళ్ళలో చేరింది. ఆండాలు తల్లితో పాటే తిరుగుతూ వుంది. ఇక వెంకటేశం ఓ ఇరానీ హోటల్‌లో టేబుళ్ళను తుడిచేవాడిగా చేరాడు.

నెల రోజులు గడిచిపోయాయి.

వెంకటేశానికి అనేక విషయాలు బోధపడసాగాయి. మొదట్లో చిక్కు సమస్యలుగా వున్న అనేక విషయాలు స్పష్టంగా తెలువసాగాయి. ఎవరెట్ల మాట్లాడతారో, ఎవరెట్లా ప్రవర్తిస్తారో కొంతవరకు తెలియసాగింది. వాళ్ళ వాళ్ళ చలాకీ మాటలు, ఒకర్ని ఒకరు ఎద్దేవ చేయడం, మాటల్లో వేగం, అట్లాగే ఊర్లో వినని అనేక కొత్త కొత్త పదాలు అతని నోటి నుంచి కూడా రాసాగాయి.

ప్రతిరోజూ అనేక రకాల వ్యక్తులు రావడం, హోటల్ టేబిల్ దగ్గర అనేక విషయాలను చర్చించడం, ఆ సమయంలో వాళ్ళ వాళ్ళ వాగ్ధాటి, వాళ్ళ పద్ధతి, ప్రవర్తనను అతిదగ్గర నుంచి గమనించడంతో తనకు తెలియకుండానే తన బుర్రలో కొత్త కొత్త ఆలోచనలు మెదలసాగాయి.

తన తోటి మిత్రులతో పాటు వెంకటేశం సినిమాలకు పోవడం, సిగరెట్లు తాగడం, బజార్లు తిరిగి రావడం అలవాటైపోయింది.

మరికొంత కాలం గడిచింది.

వెంకటేశం సినిమానటుల బొమ్మలున్న బనియన్లు వేసుకుంటూ వున్నాడు. తలజుట్టు మరీ కురచగా గాకుండా పెద్దగా పెంచుకుని వీలు చిక్కినప్పుడల్లా జేబులోంచి చిన్న దువ్వెన తీసి దూసుకోవడం అలవాటు చేసుకున్నాడు. మెడలో ఎప్పుడూ ఎర్ర చేతిరుమాలు వేసుకోవడం అలవాటయింది. అప్పుడప్పుడు బూతుమాటలు మాట్లాడడం కూడా అలవాటయింది.

ఇది నా జీవితం, నా యిష్టం, నాకు తోచిన పద్ధతిలో నడుచుకుంటానన్న దురుసుతనం క్రమంగా వెంకటేశం కదలికల్లో కనపడసాగింది.

కొడుకు ప్రవర్తనను రామయ్య గమనించక పోలేదు. కాని సరిదిద్దేందుకు ఆయనకు సమయమే లేదు. ఉదయం ఆరు గంటలకే దుకాణంలో వుండాలి. ఒక్కోసారి రాత్రి కూడా అక్కడే పడుకోవాలి. దాంతో కొడుకు యింటికి ఎప్పుడొస్తాడో, ఎప్పుడు పోతాడో తెలియదు. తెలిసినా ఏమనలేని పరిస్థితి. కొడుకు గూడా ఇంతో అంతో సంపాదిస్తున్నాడు, బుద్ధి తెలుస్తున్నది అన్న ఆలోచన గూడా లేకపోలేదు.

వెంకటేశంలాగే తాము వుండే గుడిసెల్లోని పిల్లలు, రోడ్లమీద కనిపించే పిల్లలు వుండటంతో పట్నంలో పిల్లలే ఇంత అనుకుంది రాములమ్మ.

మరికొంత కాలం గడిచింది. ఈ లోపుగా రామయ్య, రాములమ్మ సంపాదించిన డబ్బులో కొంత వెనకేశారు. డబ్బు చేతిలో కనిపించేసరికి నగర జీవితం విసుగనిపించింది. తమకు యిక్కడ గుర్తింపు వున్నట్టుగా కనిపించలేదు. పట్నానికి వొచ్చిన కొత్తలో ఆ విషయం తట్టనేలేదు. కాని ఈ మధ్యన తరచూ అదే జ్ఞాపకమొస్తూవుంది. ఊరి మీదికి మనసు మళ్ళింది. రామయ్యకు పుట్టి పెరిగిన ఊరికే పోవాలనిపించింది.

వారం రోజుల తర్వాత ఉదయంపూట-

"నువ్ నా మాట యిననప్పుడు నువ్వెట్ల నా కొడుకువు అయితవ్‌రా? పో! నీ యిష్టం వున్నట్లు చేసుకోపో-నువ్ నాకు పుట్టలేదనుకుంటపో...గిట్లయితదని నేన్ కలలగూడా నమ్మలే. గిట్లయితదని తెలిస్తే పట్నం మొహం గూడా సూడకపోతుంటి... పోరా. నువ్ నా కొడుకువు కాదనుకుంట పో..."

కొడుకును యిక సముదాయించలేక విసిగిపోయి, కోపాన్ని భరించలేక ఆవేశంతో ఊగిపోతూ గుడిసెలోంచి బయటకొస్తూ అన్నాడు రామయ్య.

వెంకటేశం తలుపువద్ద గోడకు ఆనుకుని నిల్చున్నాడు. మొఖానికి నూనె రాసినట్టుగా వుంది. పెద్దగా వున్న కనురెప్పల కింద తెల్లని కనుపాపలు తేజస్సుగా వున్నాయి. పెరిగిన తలజుట్టు సగం చెవులను మూసేసింది. మెడమీద ఎర్ర చేతిరుమాలు వేలాడుతోంది. సినిమా నటుడి బొమ్మ వున్న బనియన్ రంగు వెలిసిపోయి వుంది.

తల కిందికేసుకుని మనసులోనే మథనపడుతూ వున్నాడు. తండ్రి అరగంట నుంచి చెపుతున్న విషయాలు నిజమేనని అనిపిస్తున్నప్పటికీ, పూర్తిగా తన మనసు వాటిని అంగీకరించడం లేదు. తండ్రి మాటలకు సమాధానం చెప్పాలనే వున్నప్పటికీ మాటలు గొంతులోంచి పెకలడం లేదు. తూట మీద తూట పేల్చినట్టే అంటున్న తండ్రి మాటలను తన మనసులో పేర్చుకుని వాటికో రూపం ఏర్పరచుకునేలోగానే తిరిగి అదే విషయాన్ని కొత్త పద్ధతిలో తండ్రి చెపుతూవున్నాడు. కోపంలో ఆవేశంతో అంటున్న విషయాలకు విపులంగా సమాధానం ఎలా చెప్పాలో తెలియడం లేదు. మరుక్షణమే చెప్పడానికి ఏముంది? ఏమీ లేదే? అనిపిస్తూ వుంది. తన మనసులో వున్న విషయం ఒక్క మాటలో చెప్పానుగదా? చెప్పాక గూడా తెలుసుకోకుండా అందరూ వినేట్టుగా, చూసేట్టుగా అరుస్తున్నాడెందుకు? అని రకరకాలుగా ఆలోచిస్తూ కుడికాలు బొటనవేలుతో నేలను రాస్తూ వున్నాడు వెంకటేశం.

తల్లి గడప వద్ద కొచ్చి, కొడుకు గదవ పట్టుకుని-

"వొద్దు బిడ్డా, అట్లనకు. అయ్య మాట విను కొడుకా. నువ్ చెడిపోవాలని అంటున్నాడురా? నీ మంచి కొరకే చెపుతున్నడు బిడ్డా! అయ్య మనసు నొప్పియ్యకురా...చెప్పినట్టు విను బిడ్డా, నీ కాల్మొక్తరా వెంకటేశా..." అంది.

వెంకటేశం తల్లి చేతిని విదుల్చుకుని తిరిగి తల కిందికేసుకుని బొటనవేలితో కింద రాస్తూ వున్నాడు.

కొడుకు ప్రవర్తనకు కోప్పడుతూ-

"నీకెవడైన మందు పెట్టిండా? లేక ఎవడన్న చేతపడి చేసిండా? ఊర్లె వున్నప్పుడు ఎంత ముద్దుగ చెప్పినట్టు యిందువు. యీడి కొచ్చినంక పూర్తిగ మాట యినకుంట అయినవ్..." అంది.

వెంకటేశం ఏమీ అనలేదు.

"నువ్ వాన్నేమి బలిమిలాడుతున్నవే? వాడు పెడితేనే బతుకుతున్నట్టుంది యిప్పుడు? వాడు కష్టం చేసి పెట్టకపోతే యిగ మనం ఉపాసం వుండేటట్టున్నది? ఇన్నొద్దులు ఆడు కష్టం చేస్తేనే బతికినమా?..." భార్యతో అన్నాడు రామయ్య.

"ఏదో పోరడు తెలిసో తెలియకో అన్నడు తియ్. నువ్ బజార్లకెక్కవడితివి. ఆడు రాకుంటె ఏడికి పోతడు? నీ రక్తం గాదా? నీ మాట యినకపోయెతందుకు?..." కొడుకును వెనకేసుకొద్దామనే ఉద్దేశంతో అంది రాములమ్మ.

" ఆఁ...ఒర్లుతున్న. బజార్లకెక్కి ఒర్లుతున్న..." దీర్ఘం తీస్తూ గట్టిగా అన్నాడు రామయ్య. ఆ గొంతులో కోపం కూడా కనిపించింది.

"ఏమోనయ్యా, మీ తండ్రి కొడుకుల తోటి మాట్లాడుడే కష్టం..." అంది విసుగ్గా.

ఆండాలు తల్లి కొంగు పట్టుకునే అన్న వైపు చూస్తూ తిరుగుతోంది. ఏమీ అర్థం గాక ఏడ్పుమొఖం పెట్టుకుంది.

కొంత కోపం తగ్గినాక-

"...నీకు ఎవని 'నీడ' పడ్డదిరా? మన వంశంల ఎవడు గిసుంటోడు పుట్టలేదు. నువ్వొక్కనివి ఎల్లినవ్ ఊరు యిడిశిపెట్టి పట్నంల బతికెతందుకు..."

అని రామయ్య అంటూ వుండగానే రిక్షా రాజయ్య తన గుడిసెలోంచి బయటకొస్తూ-

"తండ్రి కొడుకుల నడుమ ఏమో నడుస్తున్నట్టుంది?" అంటూ బీడి వెలిగించుకున్నాడు.

"అరె, సూడు మామ. పోరడు ఊరికి పోదాం పారా అంటే రానంటడు. పుట్టి పెరిగిన ఊరు యిడిశిపెట్టి యాడ హోటళ్ళ ఎంగిలి చిప్పలు కడుగుకుంట వుంటడంట? అరె, మన ఊరు, జాయజాతి, కులం, తలం, మంచి, చెడ్డ అన్ని ఆడ యిడిశిపెట్టి యాడనే వుంట నంటడు. వీనికేమైన తెలివివున్నదంటవా? ఊర్లె ఎద్దుండే, యవసముండే, మాన్య ముండే, మక్త వుండే. అవన్ని యిడిశిపెట్టి నాలుగొద్దులు పూట ఎల్లగొట్టుకునేందుకు పట్నం వొస్తే యిప్పుడు ఆడు ఊరి మొఖం సూడనంటడు. మరి ఊర్లె ఎద్దు, యెవసం ఏం గావాలె? గీయింత తెలువదానే వానికి...జెర నువ్వే చెప్పు!... జెర వాని నోట్లె పట్టి ఊంచు సిగ్గొస్తది..." కసినంతా వెళ్ళగక్కుతూ అన్నాడు రామయ్య.

రాజయ్య అగ్గిపెట్టెను జేబులో వేసుకుంటూ-

"ఎందుకు రాడంటనే?" అనడిగాడు.

"ఏమో నువ్వే అడుగు."

వెంకటేశ్ మనవడి వరస కావడంతో-

"ఏమోయ్ పిలగా! మీ అయ్య అంటున్నది నిజమేనా?..." అని వెంకటేశ్‌ని అడిగాడు రాజయ్య.

వెంకటేశం క్షణం సేపు రాజయ్య వైపు చూసి తిరిగి చూపులు మరల్చుకున్నాడు.

అది గమనించి-

"ఎందుకు పోనంటున్నవోయి. మీ అయ్యతోని చెప్పేతందుకు సిగ్గయితే నాతోని చెప్పు. ఎందుకు పోవు?" అనడిగాడు.

"నాకిష్టం లేదు-నేన్ ఊరికి పోను. నాకు యీడనే మంచిగున్నది, యీడనే వుంట" అన్నాడు వెంకటేశం తల కిందికేసుకునే.

"ఇన్నావ్ మామ-వాని తమాష ఎట్లున్నదో సూశినవ్ గదా? కన్నోల్లను యిడిశిపెట్టి ఋూ మానవారణ్యంల వుంటడంట. వానికేమన్న తెలివి వున్నదంటవా?..." అన్నాడు రామయ్య కొడుకు మాటలను భరించలేక.

"జెర నువ్ ఊకోరాదు రామయ్య.... ఉరుకులాడుత వెందుకు? జెర 'సబర్' జెయ్యి. ఆడు అనంగనే అయిపోయిందా చెప్పు?" అనడిగాడు రాజయ్య.

ఇక రామయ్య మాట్లాడలేదు. ఆవేశాన్ని దిగమింగడానికి ప్రయత్నించాడు. రాములమ్మ గడప వద్ద కూర్చొని, తలకు చేతులు పెట్టుకుని కొడుకును, రాజయ్యను, భర్తను మార్చి మార్చి చూస్తూ వుంది. తల్లి పక్కనే ఆండాలు కూర్చున్నది.

రాజయ్య చేతిలోని బీడి రెండు దమ్ములు తాగి-

"ఏమోయ్, మీ అయ్యమ్మను ఇడ్శిపెట్టి నువ్వొక్కనివి ఈడ ఏడ వుంటననుకుంటున్నవ్?...ఆ ముచ్చటనైనా కుల్లం కుల్ల చెప్పు?..." అనడిగాడు వెంకటేశం దగ్గరికి వస్తూ.

"మా దోస్తుల దగ్గరుంట."

"యేలెడంత లేవ్ నీకు దోస్తు లెవడున్నడోయి?"

"................................"

"ఈ బచ్‌పనీ కయాల్ యిడిశిపెట్టు. గిప్పుడు యిట్లనే అనిపిస్తది. కన్నోల్ల కంటే దోస్తులే బెల్లం అనిపిస్తరు. కాని రేపు మంచి చెడ్డ అయితే ఎవడు ఆదుకోడు. ఈ పట్నంల ఏ దోస్తు నిన్ను సూడడు... సప్పుడు జేయవేమోయ్?"

"నేన్ పోనంటున్నగదా?"

తల పైకెత్తి దురుసుగానే అన్నాడు వెంకటేశం.

అలాంటి సమాధానాన్ని ఆశించని రాజయ్య-

"పట్నం నీళ్ళు బాగనే పనిజేశినయోయ్? నీ తల్లీ, యీ పట్నం నీళ్లేగంత..." అన్నాడు.

అంతకు మించి జోక్యం తనవల్ల కాదన్నట్టుగా రాజయ్య తల తిప్పి రామయ్య వైపు చూశాడు.

కొడుకు గొంతు వింటే తేళ్లు, జెర్లు పారినట్టయింది తండ్రికి. దాంతో-

"నాల్గు తన్ననుంటివే అన్ని, సక్కగయితడు..." అన్నాడు కోపంతో. అంతే గాక ఓపిక నశించి కొడుకును కొట్టేందుకు ముందుకు అడుగేశాడు.

రామయ్యను ఆపుతూ-

"తంతె సక్కగయితే మంచిగనే వుండు! తంతె ఏమొస్తది? ఏం రాదు. కుక్క తోకకు రాయిగడితె సక్కగయితదా? గిది గూడ గంతే..." అన్నాడు రాజయ్య.

రామయ్య కొడుకును మింగేసేట్టు చూస్తూ వున్నాడు.

"రామయ్యా, యిగ వాన్ని ఏమనకు. వాని యిష్టమున్నప్పుడు వుండనీయింరి. వాని రోగం కుదిరినప్పుడు ఆడే తిరిగొస్తడు. అంతకు మించి ఏం జేసినా కష్టమే..." అంటూ రాజయ్య చేతిలోని బీడి అక్కడ పారేసి, చెప్పుతో బీడిని నలిపి తన రిక్షా వైపు కదిలాడు.

రాములమ్మ కూర్చున్న దగ్గర నుంచి లేచి, మరోసారి ప్రయత్నం చేస్తూ-

"ఊర్లె నలుగురు ఎక్కిరిస్తర్ కొడుకా! నలుగురి ముంగట జారిపడ్డట్టు చేయకురా. నీ కాల్మొక్తగాని పోదాం పా. మల్ల నీకు పట్నం వొచ్చే బుద్ధి వుంటే ఊర్లె కొన్నొద్దులు వుండి వద్దువు పా..." అని బతిమాలింది.

వెంకటేశానికి యిక అక్కడ వుండ బుద్ధిగాక అక్కడి నుంచి కదిలి ముందుకు అడుగేశాడు.

అట్లా వెళ్ళిపోతున్న కొడుకును చూస్తె రామయ్యకు దుఃఖమొచ్చింది. రాములమ్మ "వెంకటేశా..." అంటూ ఏడుస్తూ కొడుకు వైపు రెండు అడుగులు వేసింది. కాని అప్పటికే కొడుకు మూలమలుపు తిరిగాడు.

రాజయ్య, రాజయ్య భార్యకు జెర తన కొడుకును చూస్తుండమని చెప్పి, కరువొచ్చి కన్న కొడుకు దూరమయ్యాడన్న దుఃఖంతో రామయ్య, రాములమ్మ బిడ్డ ఆండాలును తీసుకుని ఆరోజే వరంగల్ రైలెక్కారు.

*(డిసెంబర్ 1985లో ప్రచురించిన 'మహిళావాణి' సంచిక నుంచి....)*